స్కెచ్

# వంశ మర్యాద

అవసరాల రామకృష్ణరావు

"మనిషన్నవాడికి ఒకమారు చెప్తే బుద్ధుండాలి - 'అయ్యో మనకంటే పెద్దాయన, అనుభవమున్నవాడుఎందుకు చెప్తున్నాడో!' అనే జ్ఞానమైనా ఉండాలి - ఈరెండూ వదిలేస్తే ఆ మనిషిని బ్రహ్మదేవుడైనా ఏమీ చెయ్యలేడు" మోహనరావుకి తండ్రి ఎందుకిలా ధుమధుమలాడుతున్నాడో, ఎవర్ని ఉద్దేశించి ఈ మాటలు అంటున్నాడో ఏమీ బోధపడలేదు.

"అయ్యో, మన పెద్దవాళ్ళందరూ నలుగురి చేతా 'భేష్' అనిపించుకున్నవారే, అలాంటి వంశానికి అపకీర్తి తేకూడదే అన్న 'యిది' ఉంటే అసలు యిలాంటి పనులు జరుగనే జరుగవు." రాజులుగారి వాక్ప్రవాహం ఎన్ని ఆనకట్టలు కట్టినా ఆగేలా లేదు. "ఎవరిగురించి నాన్నా యీమాటలు?" అన్నాడు మోహనరావు తెగించి.

"ఎవరిగురించా? అవునవును, ఏ పాపం,పుణ్యం ఎరుగని నంగనాచివి. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతూ..."

"ఎందుకు నాన్నా అంతలేసి మాటలు? ఈ మాటలన్నీ నాగురించనుకో లేదు. యింతకీ నేనేం చేశానని?"

"వేరే ఏం చెయ్యాలి నాయనా? నిప్పులాంటి వంశాన్ని గంగలో కలిపేశావు చాలదూ!"

"అసలు, సంగతేమిటో చెప్పండి నాన్నా"

"ఆ విషయం కళ్లారా నేను చూస్తే యింతదాకా రానియ్యకనే పోదును-నారదుడులాంటి ఆ తీర్థులు ముండాకొడుకు చూశాడట. ఇంకేముంది? - ఆ దొంగముండాకొడుకు ఈవార్త అప్పుడే ఎందరికి చేరేశాడో!"

"అసలు విషయం చెప్పకుండా నన్ననవసరంగా బాధిస్తున్నారు. ఇంతకీ తీర్థులు చూసిందేమిటి?"

"ఏం చూశాడా? నిన్నరాత్రి ఒంటిగంటన్నరకు నువ్వు సానివీధిలో వాసంతి గృహంలోంచి రావడం!"

ఏ విషయం ఎవరికీ తెలియకుండా అతి రహస్యంగా ఉంచాననుకున్నాడో అదే బట్టబయలు అయిపోయింది! మోహనరావు మొహం క్షణంలో నల్లబడిపోయింది.

"రాత్రుళ్లు నువ్వాలస్యంగా వస్తే, ఓనాడు సినిమా అనీ, ఓనాడు మీటింగనీ, ఏవో సాకులనీ చెప్తే నిజమే అనుకున్నాను గాని యింత దౌర్భాగ్యపుపని చేస్తావనుకో లేదురా మోహన్!" మోహనరావు వెలవెలబోయాడు.

"ఇంట్లో లక్ష్మీదేవిలాంటి భార్య ఉంది. కావలసినంత డబ్బుంది- సానివీధి తొక్కడానికి నీకేం అవసరంరా? ఏం మాట్లాడవేం?" ఏమ్మాట్లాడుతాడు?

"మా వంశాలెటువంటివి, మా గౌరవప్రతిష్ఠలెటువంటివి? మా రాజుల వంశమంటే యీ వూరిలోవారంతా ఎంత గజగజలాడేవారో తెలుసా?"

అప్పటికీ మోహన్ నోటమ్మట జవాబు లేదు!

"ఏంరా, బెల్లంకొట్టిన రాయిలాగ మాట్లాడవేం, నీవిలా చేస్తూంటే నీ వెనుకనున్న కుర్రవెధవలు ఏమైనా బాగుపడాలా?"- ఇవాళ నుంచీ ఆ వాసంతి మొహం చూడనని ఒట్టు పెట్టుకో, ఏం అలాగేనా?

"అబ్బే, నీకు మంచిమాటలతో లాభం లేదు... రేపట్నుంచీ రాత్రుళ్లు గుమ్మం కదులు, ఏంచేస్తానో!"- రాజులు చరచరా వెళ్ళిపోయాడు.

తనవంశం చాలా గొప్పదనీ, తన పూర్వులం మహామహాత్ములనీ పాతికేళ్లు వచ్చిన తనకు తన తండ్రి అరగంట బోధపరచాలా? తనకు తెలి

యదూ? నాలుగురోజులపాటు నల్లని గజాల వెనుక కూర్చోపెట్టినంత మాత్రాన 'దొంగ'కు సంస్కారంవచ్చి మహానుభావు డైపోతాడా? అలాగే, తన తండ్రి తనకు శాస్త్రోక్త బోధ కరిచే సరికి తను వాసంతి నొదులుకుంటూ ననుకోడం శుద్ధ తెలివి తక్కువ. అందకత్తె అయిన భార్య వుందనీ డబ్బు వుందనీ తన తండ్రి చెప్పకముందే తనకు తెలుసు. 'వాసంతి' సంగతి తెలియని వాన్ని తన్నలా అనడం శుద్ధ వెర్రితనం. తనకు మాత్రం భార్యను వదలి భోగంపిల్లతో తిరగడం తప్పని తెలీదూ? కాని ఆ వాసంతి చూపులూ, ఆ మాటలూ, ఆ చలాకీతనం ఆ అనంద సామ్రాజ్యం, చూసిచూసి ఏ మొగాడు వదులుకో గలడు?

"అబ్బాయిగారిని తండ్రిగారు ఛెడామడా తిట్టి బుద్ధి చెప్పేరు కాబోలు. వంచిన మొహం ఎత్తడంలేదు?"

వరలక్ష్మి మాటలు మోహనరావుని భావనా ప్రపంచంలోంచి లేపేయి.

'ఏమిటీ? ఏమంటున్నావు లక్ష్మీ!' అన్నాడు.

"అబ్బే, ఏమీ లేదు! ఎన్నాళ్లు సాగుతాయి మీ ఆటలు? ఇక యిల్లు కదలండి చెప్తాను-యీ నాటికి దర్వాజా బంద్!-మీరు నా చేతుల్లో బంద్!" అని వరలక్ష్మి రెండు చేతులూ మోహన్ మెడచుట్టూ వేసింది.

మోహనరావు పురుగు మీద పడ్డట్టు ఉలిక్కి పడి, ఆ రెండు చేతులూ అవతలవేసి పారేసి,

'నన్ను, యివ్వాల్టికి వదిలెయ్ లక్ష్మీ, నీకు పుణ్యముంటుంది' అని దూరంగా వెళ్లిపోయాడు.

"అయ్యగారికి, చూపూ మనసూ అన్యాంకిత మయినట్లుంది-మనసు మార్చుకోమని మామనవి."

"ఏమిటి లక్ష్మీ నీ కవిత్వం?...కాస్సేపు మాట్లాడకు...నన్నాలోచించుకోనీ."

"మీకు వీలుచిక్కదు- యింక ఆ వాసంతిని కలుసుకోడం పడదు...ఎందుకు చెప్పండి అనవసరపు ఆలోచనలు?"

"అబ్బబ్బబ్బ! వెధవగోల!" అని మోహనరావు తండ్రి గదిలోకి వెళ్ళాడు. 'ఈపాటికి తను వాసంతితో అమరానందం అనుభవిస్తూ వుండును!' తీరా అలా అనుకుంటూ మోహన్ తండ్రి గదిలోకి వెళ్ళేసరికి యాజులు పక్కమీద లేడు! అప్పటికి రాత్రి పదిగంటలు అయివుంటుంది- తండ్రికి సినిమాలంటేనే అసహ్యం, మరి అయితే ఎక్కడకు వెళ్ళినట్లు? అరగంటయింది; యాజులు రాలేదు. మోహన్‌కి ఏం ఆలోచన తట్టిందో మొహం యిట్టే వికసించింది. తను యిప్పుడు వాసంతి దగ్గరకు వెడితే? అటకాయించడానికి తండ్రి లేడు- యింకేం తన అదృష్టం పండింది!!

మోహన్ త్వరత్వరగా వాసంతి యిల్లు చేరుకున్నాడు. వాసంతి గదివైపు వెడుతుంటే, వాసంతి తల్లి, 'ఓనిమిషం ఆగండి బాబూ, లోపల మనుష్యులున్నారు!' అని అటకాయించింది. మోహన్ ఎంతో కష్టంగా పక్క గదిలో కూర్చున్నాడు. లోనుండి మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

'ఏమిటో అంటారు కాని, మీకు యీ దాసీ మీద నిజంగా ప్రేమవుంటే, యిన్నాళ్లు ఆగుతారా?'

'నాకు వీలు కలగలేదంటే నమ్మవ్ కదా వాసంతీ? వాడిని రాకుండా చేశాగా! రేపట్నుంచి నిన్ను వదులుతానేమో చూడు.'

మోహన్‌కి ఆమాటలు ఎంతో పరిచితంగా కనుపించాయి. కాని ఎవరివో పోల్చుకోలేక పోయాడు.

"మీరు ఒక్కనాడు రాకపోతే నా మన సెంతో బాధపడుతుంది. నిజంగా యిన్నాళ్లు ఎలా భరించానో ఆ దేముడికే తెలియాలి! రోజూ తప్పకుండా రావాలి సుమండీ!"

"ఆ! తప్పకుండా! యిక వెడతానూ?"

ఆ వ్యక్తి తలుపు తీసుకు యివతలకివచ్చాడు. మోహన్ అప్పుడే గదితలుపు తెరచాడు. ఆ ఎలక్ట్రిక్ లైట్ల కాంతిలో ఒకరిమొహం ఒకరు చూసుకున్నారు! ఆశ్చర్యం, ఆ వచ్చినవాడు యాజులు!

తనగుట్టు తెలిసిపోయిందని యాజులూ, తనకు బోధించి,వంచించి తనఫలం పొందేడని మోహనూ ఒక్కమారే ఒకర్నొకరు ఛెళ్ళుని లెంపకాయలు కొట్టుకున్నారు.